
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# - 181 -
## దౌజీ పురస్కారం కథ

(జనవరి 14, 2023 సంక్రాంతి పండుగ నాడు భాస్కర్ రాయవరం నిర్వహించిన "కథా కళ" అనే కార్యక్రమం లో నేను చదివిన ఈ కథకి ఆశువుగా బొమ్మ గీసిన వారు ప్రముఖ చిత్రకారులు శ్రీ కూచి సాయి శంకర్ గారు)



ముగ్గురు మరాఠీలు అనుకోండి, ముగ్గురు మూర్ఖులు అనుకోండి, ఏమనుకుంటేనేం...నిత్యానందం, హేమానందం, నేనూ.... ముగ్గురం చిప్పప్పటి నుంచీ ఒకే బెంచీ మీద కూచుని చదువుకున్నాం. మా తెలుగు మేష్టారి పేరు పరమానందయ్య గారు అని వేరే చెప్పక్కర లేదు. నా పేరు ఈ కథకి అక్కర లేదు.

మాలో నిత్యానందం గాడి పేరు చూసి వాడు అను నిత్యమూ ఆనందంగా ఉంటాడు అనేసుకుంటారేమో. అబ్బే..అలాంటిదేమీ లేదు. "ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిస్సంతోషి, క్రోధనుడు, నిత్య శంకితుడు, పరభాగ్యోప జీవియు ననువారాఱుగురు దుఃఖభాగు లని నీతికోవిదులు చెప్పుదురు"...అని చిన్నయ సూరి చెప్పిన ఆ దు:ఖ భాగుడు మరెవరో కాదు. మా నిత్యానందమే!.

దానికి ఒక చిన్న ఉదాహరణ గా మా చిన్నప్పుడు జరిగిన ఒక సంఘటన చెప్తాను. మేము ముగ్గురం బి.ఏ. తెలుగు చదివినప్పుడు ఫైనల్స్ లో వాడికి గోల్డ్ మెడలూ, ఎప్పటి లాగానే నాకు అత్తెసరు మార్కులూ వచ్చాయి. "హమ్మయ్య. ఇప్పుడైనా వాడు భలే ఆనందంగా ఉండే ఉంటాడు" కదా అని కంగ్రాట్యులేషన్స్ చెప్పడానికి వాడింటికి వెళ్ళాను. తీరా చూస్తే వాడు ఎంతో సంతోషంగా ఉండే బదులు భోరుమని ఏడుస్తున్నాడు. నేను ఆశ్చర్య పోయి "అదేమిట్రా, గోల్డ్ మెడల్ వచ్చిందిగా, ఇంకా ఎందుకూ ఏడుపూ" అన్నాను. "అందుకు కాదురా. ఆ హేమా గాడికి సిల్వర్ మెడల్ వచ్చింది. అందుకూ" అని మళ్ళీ భోరుమన్నాడు. వాడికి మంచి పేరు వచ్చినప్పుడు లోలోపల కులుకుతూ పైకి మటుకు "ఏదో సార్. నాదేముందీ" అని లేనిపోని అతి వినయం చూపిస్తాడు కానీ ఇంకెవరికైనా ఏ మాత్రం మంచి పేరు వచ్చినా ఇలా బహిరంగంగానే ఏడిచి చస్తాడు మా నిత్యానందం. అది వాడికి పుట్టుక తోటే వచ్చిన బుద్ధే. ఇండియాలో చాలా మంది

తల్లిదండ్రులు పిల్లలకి పేర్లు పెట్టడం లో ఇలాగే పప్పులో కాలు వేస్తూనే ఉంటారు. వాళ్ళు సత్యం అని పేరు పెడితే అబద్ధాల కోరు తయారు అవుతాడు. ఇంట్లో రామయ్యా, వీధిలో కృష్ణయ్య అవుతాడు. వీడూ అంతే!. అసూయ వాడి బ్రేక్ ఫాస్ట్. కీర్తి కాంక్ష లంచ్ అయితే పర నింద వాడి డిన్నర్. మధ్యే మధ్యే టిఫిన్లు నిస్సంతోషం లాంటివి.. నిత్యానందం మాయా బజార్ లో శర్మా–శాస్త్రీ టైపు...కావడానికి ఉద్దండ పండితుడే కానీ.....

తెలుగు బియ్యే చదివాం కాబట్టి మాకు ఎలాగా ఉద్యోగాలు రాలేదు కదా. అంచేత అందరి లాగానే మేమూ వీధి చివర్న ఎన్నేళ్ల నుంచో ఉన్న అప్పారావు తన టైప్ ఇన్స్ స్టిట్యూట్ పేరు మార్చేసి పెట్టిన 'అమెరికన్ కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కంపెనీ' లో సర్టిఫికేట్ సంపాదించి ముగ్గురం అమెరికా వచ్చి పడ్డాం. కాలక్రమేణా ఇక్కడ హండ్రెడ్ కే ఉద్యోగాలతో త్రీ హండ్రెడ్ కే ఇళ్ళు కొనుక్కుని, పెళ్ళి అనే జీవిత చక్రం లో ఇరుక్కుని, నిలదొక్కుకుని ఏదో కాలక్షేపం కోసం కథలూ, కమామీషులూ రాయడం మొదలు పెట్టి అమెరికా ఎడారిలో ఆముదం చెట్ల లాగా వెలగడం మొదలుపెట్టాం. ఎంతయినా తెలుగు బియ్యేలం కదా...ఆ మాత్రం తెలుగు వంటబట్టింది మరి. అయితే నిత్యానందం గాడు కుక్క తోక వంకరే! నాకు ఎప్పుడు ఫోన్ చేసి పిల్చినా "నీకేమిత్రా...భలే పేరు సంపాదించుకున్నావ్", "ఎక్కడికెళ్ళినా ఫలానా ఆయన తెలుసునా అని నీ గురించే అడుగుతున్నారు. చెప్ప లేక చస్తున్నాను", అనో, "మొన్న నేను రాసిన కథ ఇక్కడ తానా వాళ్ళు, అక్కడ తానా వాళ్ళ వాళ్ళు వేసుకున్నారు, తెలుసా?, అందులో నీ కథ ఏమీ లేదేమిటీ, రిజెక్టడా?..ఇలాంటి ఈర్ష్యాయుళువు మార్కు డయలాగులతో తప్ప మాట్లాడ లేడు. కానీ వీడి సంగతి నాకు తెలుసుగా...పట్టించుకోను. వీడికి ఒక స్వీయ మర్దన, పరస్పర మర్దన, పర నింద బేచ్ ఒకటి ఉంది. అందులో నేను లేను. అదీ వాడికి నా మీద కక్ష.

మొన్నీ మధ్య ఎప్పటిలాగానే ఒకానొక అపరాత్రి వేళ నా ఫోన్ మోగింది. ఆ టైమ్ కి ఫోన్ వస్తే అది ఎలాగా అది మా శాలువా గారిదే కదా అని "చెప్పండి, శాలువా గారూ" అన్నాను. కనపడిన ప్రతీ ఎన్నారైకో, లేకపోతే దారిన పోయే దానయ్యకైనా సరే రోజుకో శాలువా కప్పితే కానీ నిద్రపట్టని సన్మానోప జీవి ఆయన.

"మీ అమెరికా నించి ఎవరో నిత్యానందం అనే రచయిత వచ్చే వారం హైదారాబాద్ వస్తున్నారుట కదా?" – ఏ దేశం నుంచి ఎవరు ఎప్పుడు హైదరాబాద్ వస్తున్నారో ఆయనకి ఆకాశవాణి ముందే చెప్పేస్తుంది అనుకుంటాను.

"ఎవరు? నిత్యానందమా?"

"అవును ట. మరి ఆయనకి అక్కినేని పురస్కారం ఇవ్వనా, లేక భానుమతి, దాసరి, సినారె, ... ఏదైనా పరవా లేదు కదా లేక శాలువా–గురజాడ, దేవులపల్లి–శాలువా, రాయప్రోలు, విశ్వనాధ ...ఇలా సహస్ర పురస్కార నామాలు చెప్తూనే...పోనీ అమెరి కవి కిరీటి, అమెరికథా సామ్రాట్...లాంటి బిరుదు ఎలా ఉంటుందీ?" రెచ్చి పోతున్నారు శాలువా గారు. 'స్వర్ణ కంకణం కూడా వెయ్యవచ్చును కానీ అది అమెరికా నుంచి ఆయన తెచ్చుకోగలడా? ఏమంటారు?'.....శాలువా గారి ప్రశ్న--

"ఆగండాగండి. అదేమిటీ అన్నీ చచ్చి పోయిన వాళ్ళ పేర్లే చెప్తున్నారూ? ఏదో జొన్నవిత్తుల, తనికెళ్ల భరణి ఎవార్డో, రంగనాయకమ్మ, నగ్నముని దిగంబర పురస్కారమో ఇవ్వొచ్చుగా?"

"అబ్బే..లేదు సార్..బతికున్న వాళ్లయితే వాళ్ళనీ పిలవాలి, ముందు వాళ్ళ భజన చెయ్యాలి, శాలువా, చెక్క ముక్కా...ఇవ్వాలి కూడా కదా!. పోయినోళ్ళు అయితే అందరూ మంచోళ్ళు. వాళ్ళ గురించి ఏమీ చెప్పక పోయినా నోరు మెదపరు."

"పోనీ ఏదో పి.జి. వుడ్ హౌస్ ఎవార్డు, ఓ హెన్రీ ఎవార్డు,బిల్ గేట్స్, స్టీవ్ జాబ్స్ ఎవార్డు అని లెవెల్ పెంచేసి ఇంగ్లీషు రచయితలో, అమెరికా వాళ్లవో ఎవార్డు ఇస్తే మా నిత్యా గాడు భలే ఆనంద పడతాడు"

"మన పత్రికల వాళ్ళకి ఆ పేర్లు తెలీవు సార్. ఫుడ్డూ గాడిద గుడ్డూ అని రాసేస్తారేమో. అవునూ...మా నిత్యా గాడూ, గీడూ అంటున్నారేమిటీ? మీకు నిత్యానందం గారు తెలుసా?"

"నిత్యానందం తెలియకేం. నా చిన్నప్పటి క్లాస్ మేట్ కదా...ఒరే అంటే ఒరే ..మా బియ్యే బేచ్ గోల్డ్ మెడల్ వాడిదే...యాభై ఏళ్ళ క్రితం."

"యాభై ఏళ్ళ క్రితమా? అయితే ఆయన కీ తొంభై ఎళ్ళుంటాయన మాట..."

"ఏమన్నారూ?" – నా వయసు విషయం లో శాలువా గారి అంచనా నాకు అస్సలు నచ్చ లేదు మరి.

"అదే. పెద్దాయనే కదా.....గోల్డ్ మెడలిస్టా..అయితే ఇంకేం.. ఆయన స్వర్ణ పతకానికి మెరుగు పెట్టి గోల్డ్ మెడల్ కి గోల్డెన్ జూబిలీ అని స్పెషల్ అవార్డు ఇచ్చేద్దాం" అని ఆనందంగా ఫోన్ పెట్టేశారు శాలువా గారు.

ఒక నెల తర్వాత నిత్యానందం ఫోన్ చేశాడు. "ఒరే,..మొన్న క్రిస్మస్ కి ఇండియా వెళ్ళినప్పుడు ఏం జరిగిందో నీ జన్మలో ఊహించలేవు. తెలిస్తే ఏడిచి ఛస్తావ్?. "

"సరేలే. చెప్పి చావు"

"అక్కడ శాలువా ఆర్ట్స్ అనే గొప్ప కల్చరల్ ఆర్గనైజేషన్ వాళ్ళు నాకు ఒక స్పెషల్ అవార్డు ఇచ్చారురా. ప్రతిష్టాత్మకమైన దౌజీ పురస్కారం ట. "తెలుగు సాహిత్య ప్రపంచం లో ఈ దౌజీ పురస్కారం అందుకున్న వాళ్ళలో నేనే మొట్ట మొదటి వాడినిట అలా అని అన్నీ పేపర్లలోనూ వేశారు. కటింగులు వాట్సప్ చేస్తాను. "– నా రియాక్షన్ కోసం ఆతృతగా ఎదురు చూశాడు నిత్యానందం.

"వావ్..కంగ్రాట్యులేషన్స్ రా...మొత్తానికి సాధించావ్!. ఇంతకీ ఈ దౌజీ ఎవరు? "

"ఏమో, నాకేం తెలుసు? జంషెడ్ జీ, నౌరోజీ, గోద్రెజ్ లాగా ఎవరో గొప్ప పార్శీ రైటర్ అయి ఉంటాడు. ఎవరైయితే మనకేం" అని గాలిలో తేలిపోతూ ఈ వార్త తన మర్దన మేచ్ కి బట్వాడా చెయ్యడంలో బిజీ అయిపోయాడు నిత్యానందం.

నాకు కుతూహలం ఆగక వెంటనే శాలువా గారిని పిలిచి "ఏమిటి సారూ. మా నిత్యానందానికి ఇచ్చిన పురస్కారం లో దౌజీ గారు కవి పుంగవులా, పార్కీ వాడా? బతికున్నాడా లేక అక్కినేని, సినారె బాపతా?" అని అడిగాను. ఆయన నవ్వేసి "నాకు మటుకు ఏం తెలుసు. ఏ పురస్కారం ఇస్తే బావుంటుందో అని మీకు ఫోన్ చేసినప్పుడే హేమానంద్ గారికి ఫోన్ చేస్తే ఆయన ఈ ఐడియా ఇచ్చారు. ఆయన కూడా మీ చిన్నప్పుడు క్లాస్ మేట్ ట కదా. తనకి సిల్వర్ మెడల్ వచ్చినట్టు చెప్పారు..."

"హారినీ, హేమా గాడా?" అని ఆశ్చర్య పోయి హేమానంద్ గాడిని పిలిచాను.

"అవునురా...ఇప్పుడే నిత్యానంద గాడు తనకి దౌజీ అవార్డు వచ్చింది అని ఫోన్ చేసి తెగ పొంగి పోతున్నాడు. ఆ వెధవకి చెప్పనా, వద్దా, చెప్తే ఎలా చెప్పాలీ అని ఆలోచిస్తున్నాను." –అన్నాడు హేమానంద్.

"నీ దుంపదెగా... ఇంతకీ ఎవడ్రా ఈ దిక్కుమాలిన దౌజీ గాడు?"– అని అడిగాను.

"ఇంకెవడూ..వాడే...నిత్యా గాడే!.అందరికీ జీవన సాఫల్య పురస్కారం, జీవన సౌభాగ్య పురస్కారాలు ఇస్తే ఈ వెధవ జన్మంతా అందరినీ..ఆఖరికి నిన్నూ, నన్నూ కూడా తిడుతూనే దౌర్భాగ్య జీవితం గడిపాడు కదా. అంచేత వాడికి జీవన దౌర్భాగ్య పురస్కారం ఇవ్వండి అని ఏదో సరదాగా చెప్పాను శాలువా గారికి. ఆయనేమో అది సీరియస్ గా తీసుకుని ఈ దౌజీ..అంటే దౌర్భాగ్య జీవన పురస్కారం అనే కొత్త ఎవార్డు కనిపెట్టారు. ఏం చెయ్యమంటావ్? వాడికి చెప్పనా..ఈ సారికి ఇలా కానిద్దామా?"

**COMMENTS**